క్లుప్తంగా

డీఎల్‌పీఓ బాధ్యతల స్వీకరణ



వీరభద్రప్పకు స్వాగతం పలుకుతున్న ఉద్యోగులు

తుగ్గలి: పత్తికొండ డివిజినల్ పంచాయతీ అధికారిగా హెచ్ వీరభద్రప్ప నియమితులయ్యారు. ఆదోని డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఈయనకు అదనంగా పత్తికొండ డీఎల్‌పీఓగా బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈవోపీఆర్డీ నరసింహులు, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

అక్రమ నిర్మాణాలు అరికట్టండి

హొళగుంద: గజ్జహళ్లి గ్రామం బస్టాండు ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరగకుండ చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు సోమవారం హొళగుందలో ఎంపీడీఓ విజయలతకు వినతి పత్రం అందజేశారు. ఎంపీడీఓకు గోపాల్, మల్లయ్య, దస్తగిరి, శిద్దలింగ తదితర గ్రామప్రజలు సమస్యను వివరించారు. బస్టాండ్ సర్కిల్ చిన్నదిగా ఉండడం వలన అక్కడ విగ్రహాలు, బోర్డులు ఏర్పాటు బాగుండదన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మాంసం దుకాణాలను తొలగించండి



తహసీల్దారు సతీష్‌కు సమస్యను వివరిస్తున్న నెరణికి గ్రామపెద్దలు, బీజేపీ నాయకులు

హొళగుంద: నెరణికి గ్రామంలోని ఆంజనేయ స్వామి, మారెమ్మ దేవి ఆలయాల వద్ద ఉన్న మాంసం దుకాణాలను వెంటనే తొలగించాలని నెరణికి గ్రామపెద్దలు, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, సీనియర్ నాయకుడు చిదానంద, గ్రామపెద్దలు సోమన్న, మల్లికార్జున, గిరి, జాంటీ వీరేష్ తదితరులు తహసీల్దారు సతీష్, ఎంపీడీఓ విజయలతకు ఫిర్యాదు చేశారు. గతంలోనూ వినతి పత్రాలు ఇచ్చినా అధికారులు స్పందించలేదని, పవిత్రమైన దేవాలయాల వద్ద మాంసం దుకాణాలు నడపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించిన దుకాణాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఎంపీడీఓను కోరారు.

సమస్యలపై పోరాటం చేస్తాం

ఆస్పరి: ఉపాధ్యాయుల సమస్యలపై ఆలుపెరుగని పోరాటం చేస్తామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు దేవపాల్, వెంకటేష్ తెలిపారు. సోమవారం ఆస్పరిలో సర్ణోత్సవ మహాసభను నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాటాలు చేశామన్నారు. ప్రభుత్వం అనవసరమైన యాప్స్‌ను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన రూ. 20వేల కోట్లు బకాయిలు చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తామని నాయకులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మండల కమిటీ అధ్యక్షుడిగా రంగన్న, ప్రధాన కార్యదర్శిగా బాబుతోపాటు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ప్రతాప్‌రెడ్డి, క్రిష్ణవేణి పవన్‌కుమార్, అనిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముటాముల్లె సర్దుకుని..



తుగ్గలిలో మూటాముల్లె సర్దుకుని వలస వెళుతున్న కూలీలు

తుగ్గలి : కూలీలకు చేతినిండా పనిలేక వలసబాట పడుతున్నారు. ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాలతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఆశించిన దిగుబడులు రాలేదు. గ్రామాల్లో చేసేందుకు పని కరువైంది. ఉపాధి పనులు కూడా కల్పించక పోవడంతో కూలీలకు వలసబాట తప్పడం లేదు. ఇప్పటికే కోతికొండ, బొందిమడుగుల గ్రామాల నుంచి పలువురు కూలీలు కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలకు వలస వెళ్లారు. మంగళవారం రాత్రి తుగ్గలికి చెందిన పలు కుటుంబాలు తెలంగాణ రాష్ట్రంలో పత్తి తీసే పనులకు వెళ్లారు.

వంట ఏజెన్సీ నిర్వాహకుల ధర్నా

ఆలూరు: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నభోజనం ఏజెన్సీల నిర్వాహకులపై కూటమి నేతలు ఒత్తిడి తగదని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన వంట ఏజెన్సీల నిర్వాహకులు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి షాకీర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి తదితరులు మాట్లాడారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతం వినతి పత్రాన్ని ఎంఈఓ కోమలాదేవికి అందజేశారు.

వణికిస్తున్న ‘భౌభౌ’

- వెంటపడి కాటేస్తున్న గ్రామ సింహాలు
- ఏటేటా పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- గతేడాది 70 మంది.. ఈయేడు ఇప్పటికే 93 మందికి కుక్కకాటు
- బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం



నడిరోడ్డులో కుక్కల గుంపు

మద్దికెర : గ్రామ సింహాలు జనాన్ని హడలెత్తిస్తున్నాయి. ప్రజలను వెంటాడి మరీ కాటేస్తున్నాయి. దీంతో జనం వణికి పోతున్నారు. కుక్కలు కనిపిస్తే బెంబేలెత్తుతున్నారు. ఈ పరిస్థితి మండల కేంద్రం మద్దికెరలో మరీ ఎక్కువగా ఉంది. గ్రామాల్లోనూ వీధికుక్కలు జనాన్ని భయపెడుతున్నాయి. మండలంలో దాదాపు 5 వందల వరకు కుక్కలు ఉంటాయని అధికారుల అంచనా. ఎక్కడ చూసినా కుక్కలు పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. మండల కేంద్రంలో కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ప్రతి వీధిలో కుక్కల గుంపు దర్శనం ఇస్తూనే ఉంటాయి. నడిరోడ్డులో తిష్ట వేస్తుండడంతో ప్రజలు అటువైపు వెళ్లేందుకు భయపడుతున్నారు. వృద్ధులు, పిల్లలు బయటకు వెళ్లారంటే ఇంటికి వచ్చేంత వరకు కుటుంబ సభ్యులు ఆందోళన గురవుతుంటారు. బాటసారులు, వాహనచోదకులను వదలడంలేదీ గ్రామ సింహాలు. వెంబడించి కాటేస్తుంటాయి. కుక్కకాటుకు గురవ్వని వీధి లేదనంతగా ఉంది పరిస్థితి. ప్రత్యేకించి చికెన్ సెంటర్లు, గ్రామ శివారు కాలనీలో వీటి బెడద మరీ ఎక్కువ. అటుగా వెళ్లాలంటే హడలే. ముందు, వెనుక చూసుకుంటూ బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి. స్థానిక ఆసుపత్రిలో రాబిస్ ఇంజక్షన్లు లేక పత్తికొండకు పరుగులు పెట్టాల్సి వస్తోందని కుక్కకాటు బాధితులు వాపోతున్నారు. కుక్కల బెడద నుంచి కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పది నెలల్లో 93 మందికి కుక్కకాటు

మండలంలో యేటాటా కుక్కకాటు బాధితులు పెరుగుతున్నారు. గతేడాది గతేడాది 70 మందికి గురైనట్లు రికార్డులు చెబుతన్నాయి. ఈ యేడు పది నెలల్లోనే 93 మంది కుక్కకాటుకు గురయ్యారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గతేడాది దాదాపు రాబిస్ ఇంజెక్షన్లు 210, ఈయేడు ఇప్పటి వరకు 280 రాబిస్ ఇంజెక్షన్లు బాధితులకు వేశారు. ఈ లెక్కన ప్రతి నెలా 10 మంది కుక్కకాటుకు గురువుతూనే ఉన్నారు.



రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి



ప్రభుత్వ వైద్యశాలలో రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. కుక్క కరిచిన వెంటనే వైద్యశాలకు వచ్చి వైద్యుల సూచనల మేరకు వ్యాక్సిన్ వేయించు కోవాలి. వ్యాక్సిన్ వేయించుకోవడం వలన కుక్కలు కాటేసినా ఎలాంటి ప్రమాదం ఉండదు. ఏ కుక్క కరిచినా ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలి. సొంత వైద్యం చేసుకోవద్దు.

– డాక్టర్ రాగిణి, మద్దికెర.

గతంలో కుక్కలను పట్టించాం



మద్దికెర గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గతంలో దాదాపు 350 కుక్కలను పట్టించాం. అయినా మళ్లీ పెరిగిపోయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడతాం. అంతేగాక చికెన్ సెంటర్ల వద్ద ఎక్కువగా ఉంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దుకాణాల నిర్వాహకులకు అవగాహన కల్పించి చికెన్ వ్యర్థపదార్థాలను గ్రామానికి దూరంగా పడేసేలా చర్యలు తీసుకుంటాం.

– బండారు సుహాసిని, సర్పంచ్, మద్దికెర.

బయటికి రాలేకపోతున్నాం...



కుక్కల భయంతో బయటికి రాలేకపోతున్నాం. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు దర్శనమిస్తున్నాయి. ఏ కుక్క వచ్చి కరుస్తుందోనని భయంగా ఉంటుంది. ఎంత జాగ్రత్తగా ఉన్నా నన్నుకూడా కుక్క కరిచింది. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ఇంజెక్షన్లు వేయించుకున్నా. దాదాపు మూడు నెలల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డా. అధికారులు పరిష్కార చర్యలు తీసుకోవాలి.

– పరుశురాముడు, మద్దికెర.

కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలి



వీధికుక్కలు, పెంచుకున్న కుక్కలను పశు వైద్యశాలకు తీసుకువస్తే టీకాలు వేస్తాం. ఈ టీకాలు వేస్తే కుక్కలు కరిచినా రేబిస్ వ్యాధి సోకదు. కుక్కకాటు బాధితలకు ఎలాంటి ప్రమాదం ఉండదు. ప్రజలు తాము పెంచుకునే కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి. అదేవిధంగా పంచాయతీ సిబ్బందితోపాటు ఆయా కాలనీల ప్రజలు చొరవు తీసుకుంటే వీధి కుక్కలకు కూడా టీకాలు వేస్తాం.

– కృష్ణానాయక్, పశు వైద్యాధికారి, మద్దికెర.

ఐదుగురు వీఏఏలకు పదోన్నతి

పత్తికొండ(తుగ్గలి): రైతు సేవా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న ఐదుగురికి ఏఈఓలుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం పదోన్నతి పొందిన ఏఈఓలు ఏడీఏ మోహన్‌విజయకుమార్‌కు తమ జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. రైతులకు అందుబాటులో సేవలందించాలని ఏడీఏ వారికి సూచించారు.

31న ఆరాధన మహోత్సవం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలో వెలసిన గుడికల్ సద్గురు హుసేన్‌పీరా స్వామివారి ఆరాధన మహోత్సవాలు ఈ నెల 31వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు భక్త బృందం సభ్యులు కామేశ్వరయ్య, నేతాజీరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 31న స్వామికి గంధం సమర్పణ, నవంబర్ 1న ఆరాధన మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.

2న మండల మీట్

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నవంబర్ 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి పనులతో పాటు అజెండాలోని అంశాలను చర్చిస్తామన్నారు. అలాగే ఆయా శాఖల పై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. అజెండాలో తెలిపిన అన్ని శాఖలకు సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని ఎంపీడీఓ కార్యాలయానికి ఒక రోజు ముందుగానే పంపించాలని ఆమె అధికారులకు సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వలంటీర్ల నిరసన



పత్తికొండ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వలంటీర్లు

పత్తికొండ(తుగ్గలి): వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షుడు పెద్దయ్య, ప్రధాన కార్యదర్శి హనుమేష్, వలంటీర్ అసోసియేషన్ నాయకుడు రవి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి వలంటీర్లతో ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయం వరకు వెళ్లి ధర్నా నిర్వహించారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు నెలకు రూ.10వేలు జీతం, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా హామీని అమలు చేయలేదన్నారు. వలంటీర్ల నాలుగు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ ఏఓ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐవైఎఫ్ నాయకులు విజయ్, చిరంజీవి, వినోద్, వలంటీర్లు పెద్దయ్య, లలిత, రజిని పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ నరేంద్రకుమార్

ఆస్పరి: సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏఓ నరేంద్రకుమార్ సూచించారు. సోమవారం ఆస్పరి వ్యవసాయ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా ఏఓ మాట్లాడుతూ జవాబుదారీతనం, పారదర్శకత, సంక్షేమ పథకాలను అమలు, ప్రజల భాగస్వామ్యం కొరకు ఈ సమాచార హక్కు చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. అర్జీదారుడు అడిగిన సమాచారాన్ని 30రోజులు గడువులోపు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిర్ణీత సమయంలో సంబంధిత అధికారి తగిన సమాచారాన్ని అందించకపోతే ఉన్నతాధికారులకు అప్పీలు చేసుకోవచ్చన్నారు.

ఆలూరు సొసైటీలో దూషణల పర్వం!

ఆలూరు: స్థానిక సహకారపరపతి సంఘంలో సోమవారం దూషణల పర్వం నెలకొంది. సంఘం కార్యదర్శి వెంకటరెడ్డి, ఆలూరు కేడీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్ భాషా సొసైటీ రుణాల వసూళ్ల విషయంపై ఒకరినొకరు దూషించుకున్నారు. సొసైటీ రుణాల వసూళ్ల చేయడంలో నిర్లక్ష్యం తగదని కార్యదర్శిపై సూపర్‌వైజర్ ఆగ్రహం వ్యక్తం చేయగా ఆయన సైతం కొనసాగించాడు. నీచేతకాని తనం వల్లే 2023 నుంచి ఇప్పటి వరకు ఈ సంఘంలో రైతులు తీసుకున్న రూ 11 కోట్లు తీసుకున్న రుణాల పెండింగ్ ఉన్నాయని సూపర్‌వైజర్ నిలదీశాడు. పంటల దిగుబడి బాగా తగ్గిపోవడంతోనే రుణాలు వసూళ్ల చేయలేకపోయామని, దానికి నేనెలా బాధ్యుడిని కార్యదర్శి ఘాటుగా స్పందించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉన్నతాధికారులు నుంచి నాపైఒత్తిడి తెస్తున్నారని సూపర్ వైజర్ అసహనం వ్యక్తం చేశారు. వచ్చే నెలలోగా కనీసం రూ 2 కోట్లు వసూళ్ల చేయకుంటే నీవైనా ఇక్కడ ఉండాలి లేదా నేనైనా ఇక్కడ ఉండబోనని ఒకరిపై ఒకరు రుస, రుస లాడారు. నివ్వెరపోయిన సిబ్బంది చూస్తూ ఉండిపోయారు.

కళాశాలలో భోజన పథకం అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మద్దికెర: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో విద్యారంగంలో సమూలమైన మార్పులు తీసుకొస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ ఇచ్చినా ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.3,480 కోట్ల విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లో మెస్ చార్జీలు పెంచి యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ హుస్సేన్‌సాహెబ్‌కు అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు తరుణ్, నాయకులు వేణు, అనిల్, ప్రకాష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామానికి చెందిన ఉపాధి కూలీ చిన్న మల్లికార్జున(45) గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బతుకుదెరువు కోసం బెంగళూరుకు వలస వెళ్లిన ఉపాధి కూలీ చిన్నమల్లికార్జున సోమవారం పని ముగించుకుని వస్తుండగా ఛాతిలో నొప్పి అంటూ కింద పడిపోయాడు. స్థానికులు ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బెంగళూరులో చిన్నమల్లికార్జున గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరుమని రోధించారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారులు మణికంఠ, భరత్ కుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆస్పరి: మండలంలోని చిగిళి బస్టాప్ మిట్ట దగ్గర సోమవారం స్కూటర్‌ను బొలేరా వాహనం ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు నగరూరు గ్రామానికి చెందిన వీరేష్, గోవర్దన, మల్లికార్జున స్కూటర్‌పై ఆస్పరికి పనిమీద వచ్చి తిరిగి వెళ్తున్నారు. చిగిళి బస్టాఫ్ మిట్ట దగ్గర దేవనకొండ మండలం బంటుపల్లి గ్రామానికి చెందిన పత్తి సంచులను తీసుకెళ్తున్న బొలేరా వెనుక నుంచి స్కూటర్‌ను ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. బొలెరా వాహనం సైతం బోల్తాపడింది. వీరేష్‌కు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గోవర్ధన, మల్లికార్జునకు రక్త గాయలు కావడంతో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈవిషయాన్ని ఆస్పరి సీఐ మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

దేవనకొండ: రబీ సీజన్‌లో పప్పుశనగ, వేరుశనగ, టమాటా, మిరప, మొక్కజొన్న పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటలబీమా చేయించుకోవాలని ఏఓ సురేష్‌బాబు సూచించారు. రబీ సీజన్‌లో బ్యాంకులో రుణాలు పొందారో వారికి బ్యాంకులే ప్రీమియం చెల్లిస్తాయన్నారు. రుణాలు తీసుకోని రైతులు శనగకు ఎకరానికి రూ.230, వేరుశనగ రూ.290, మిరపకు రూ.525, టమాటాకు రూ.72, మొక్కజొన్నకు రూ.297 చొప్పన చెల్లించాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరుపాక్షి



హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుంది
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి

ఆస్పరి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి తెలిపారు. పార్టీ కోసం పని చేసిన నాయకులు, కార్యకర్తలకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. సోమవారం ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వైఎస్సార్‌సీపీ మండల, గ్రామ కమటీల ఎంపికపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తున్నా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనను ప్రజలు తలచుకుంటున్నారన్నారు. అయితే టీడీపీ నాయకులు అధికారంతో రెచ్చిపోతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతున్నారని, ఎవ్వరూ భయపడొద్దని అన్నివిధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తల్లికి వందనం, నిరుద్యోగభృతి, రైతులకు పెట్టుబడి సాయం, ఫ్రీబస్సు హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని సీఎం చంద్రబాబునాయుడు ప్రతి నెలా ఎదో ఒక తప్పుడు ప్రచారం సృష్టిస్తున్నారని విమర్శించారు. ఉచిత ఇసుక పేరుతో కూటమి నాయకులు దోచుకుంటున్నారని, విషయాన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, నాయకులు పెద్దయ్య, గోవర్ధన, మూలింటి రాఘవేంద్ర, వెంకన్న, బసవరాజు, తోయజాక్షప్ప, సుంకుర రామాంజినేయులు, శివానంద, దత్తాత్రేయరెడ్డి, పురుషోత్తమరెడ్డి, పెద్దరెడ్డి, మనోహర్‌రెడ్డి, చిన్నాయప్ప, తిమ్మప్ప, రాజన్నగౌడ్, కౌలుట్లయ్య, ప్రకాష్, పాండు, లక్ష్మన్న, రాజశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, శివా తదితరులు పాల్గొన్నారు.

నేడు పత్తికొండకు సీపీఐ రాష్ట్ర బృందం

పత్తికొండ(తుగ్గలి): పత్తికొండ మండలం పందికోన వద్దనున్న హంద్రీ–నీవా రిజర్వాయర్, ప్రధాన కాలువ పరిశీలనకు మంగళవారం సీపీఐ రాష్ట్ర బృందం రానున్నట్లు ఆ పార్టీ కార్యదర్శి రాజాసాహెబ్ తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, రైతులు విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

డోన్ రూరల్: మండల పరిధిలోని బొంతిరాళ్ల గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వేణుగోపాల్(23) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. మృతుడు కృష్ణగిరి మండలం, కోయికొండ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇటీవల వివాహం నిశ్చయమైందని పేర్కొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

కృష్ణగిరి: గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వీఆర్వోలు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. రీసర్వే జరిగిన మూడు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సర్వేయర్లతో పొలాలను మరో మారు సర్వే చేసి తప్పులను సరిదిద్దాలన్నారు. అలాగే ప్రజావాణిలో వచ్చే రెవెన్యూ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.

యువకుడిపై దాడి

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామానికి చెందిన మాదిగ ఉమేష్‌ను అదే గ్రామానికి చెందిన యువకుడు చెర్నకోలుతో దాడి చేశాడు. దుర్భాషలాడుతూ ధూషించాడని బాధితుడు మాదిగ ఉమేష్ ఆందోళన వ్యక్తం చేశాడు. గాయపడిన ఉమేష్‌ను బంధువులు ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆదోనికి రెఫర్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

విద్యా దీవెన నిధులు విడుదల చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఆలూరు: విద్యార్థులకు ప్రభుత్వం విద్య దీవెన, వసతి దీవెన, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కలాశాలల నుంచి విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం చేరుకుని ధర్నా చేశారు. ఈసందర్బంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మహేష్, చంద్ర, బోటయ్య, పురుశోత్తం, తిరుమలేష్ తదితరులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు గోవిందు సింగ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కృష్ణగిరి: రబీ సీజన్‌లో యాజమాన్య పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం పంటల సాగుపై రైతులకు వివరించారు. వేరుశనగ, పొద్దుతిరుగుడు, శనగ పంటల సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు అవలంభించాలని సూచించారు. మేలైన విత్తనం ఎంపిక, విత్తన శుద్ధి, సమగ్ర సస్యరక్షణ మొదలైన విషయాలను వివరించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట పూత దశలో ఉందని వ్యవసాయ అధికారుల సూచన మేరకు పురుగు ఉధృతిని నివారించుకోవాలని పేర్కొన్నారు.

కందిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

మద్దికెర: కంది, పప్పుశనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటించి తెగుళ్ల నివారణ నుంచి కాపాడుకోవాలని ఏఓ రవి తెలిపారు. తెగుళ్ల నివారణ కోసం పలు సూచనలు చేశారు. మండలంలో 12,473 ఎకరాల్లో కంది పంట సాగు చేశారన్నారు. పంటలో మారుక మచ్చల పురుగు ఎక్కువగా ఆశించి పంటను నాశనం చేస్తోందని తెలిపారు. నివారణకు కార్బోసల్ఫాన్ (మార్షల్) 250 ఎంఎల్ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు లామ్డాసైహలోత్రిన్ 250 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. అదే విధంగా కంది పూత రాలుతుంటే నివారణకు 40 మి.లీ ప్లానోఫిక్స్ మరియు బోరాన్ 250 గ్రాములు లీటర్ నీటిలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే పప్పుశనగ 20 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారని.. పంటకు ఎండవడలు ఆశిస్తోందని, నివారణకు సాఫ్ 2.0 గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్కల మొదళ్లు తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు.

5న హుండీ కానుకల లెక్కింపు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో నవంబర్ 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి హుండీ కానుకల లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వీరయ్య సోమవారం తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే భక్తులు దేవదాయ ధర్మదాయశాఖ నిబంధనల మేరకు లుంగీ, కండువా ధరించి రావాలని సూచించారు. ఆసక్తి ఉన్న భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొనవచ్చన్నారు.